
సాక్షి బాపట్ల

బుధవారం । 19 । మార్చి । 2025



నేడు పునీత జోజప్ప మహోత్సవం

పెదకూరపాడు: జలాలపురం గ్రామంలో పునీత జోజప్ప మహోత్సవ ఏర్పాట్లు చేశారు. బుధవారం సమష్టి దివ్య పూజాబలి నిర్వహణకు చర్చి కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 518.80 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విజయవాడ భవానీపురానికి చెందిన కనమర్లపూడి రామకృష్ణ, సౌమిత్రి పద్మవల్లి రూ. 1,00,116 విరాళమిచ్చారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహర్ (గురు)
బాపట్ల	6.24	4.56
నరసరావుపేట	6.26	4.58
గుంటూరు	6.24	4.56

న్యూస్‌రీల్

ఇసుక తవ్వకాలు తనిఖీ



కొల్లూరు: ఉచిత ఇసుక క్వారీలో నదిలో నేరుగా యంత్రాలను వినియోగించి అక్రమ తవ్వకాలు జరుపుతూ లారీలకు లోడింగ్ చేయడంపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో మైనింగ్ శాఖాధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. మైనింగ్ శాఖ అసిస్టెంట్ జియాలజిస్టు ఫణికుమార్ నేతృత్వంలో సిబ్బంది గాజుల్లంక వద్ద కృష్ణా నదిలో చేపట్టిన తవ్వకాలు పరిశీలించారు. క్వారీలో యంత్రాలను వినియోగించి చేపట్టిన తవ్వకాల పరిశీలన తూతూమంత్రంగా ముగించడంతోపాటు అత్యంత గోప్యత పాటించారు. అక్రమ తవ్వకాలపై సమాచారం ఇచ్చేందుకు మైనింగ్ శాఖాధికారులు విముఖత ప్రదర్శించారు. ఉచిత ఇసుక క్వారీలో నిర్దేశించిన ప్రదేశంలో కాకుండా కృష్ణా జిల్లా పరిధిలో చేపట్టిన తవ్వకాలను మైనింగ్ శాఖాధికారులు పరిశీలించారు. దీనిపై అసిస్టెంట్ జియాలజిస్టు ఇసుక క్వారీలో తవ్వకాలపై ఎటువంటి సమాచారం ఇచ్చేందుకు తమకు అధికారం లేదని, నివేదికలు సిద్ధం చేసి మైనింగ్ శాఖ ఏడీకి అందజేస్తామని సరిపెట్టారు. కాగా, గాజుల్లంక ఉచిత ఇసుక క్వారీలో జేసీబీని సీజ్ చేసినట్లు కొల్లూరు ఎస్ఐ జి. ఏడుకొండలు తెలిపారు. మైనింగ్ శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

వసతి గృహాలలో పరిశీలన



గుంటూరు లీగల్: క్యాలెండరు యక్టివిటీస్‌లో భాగంగా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు మంగళవారం గుంటూరు మహిళా ప్రాంగణంలోని ఎస్టీ బాలికల పాఠశాల, వసతి గృహాన్ని, ఎస్టీబాలికల కళాశాల వసతి గృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడారు. వారికి అందుతున్న సదుపాయాల గురించి, ఆహార నాణ్యత గురించి తెలుసుకున్నారు. అనంతరం స్కూల్ వసతి గృహం వార్డెన్ జి.హిమ శిల్ప, కళాశాల వార్డెన్ రాజేశ్వరిలను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బీఈడీ పేపర్ లీకేజ్ నిందితులకు బెయిల్

గుంటూరు లీగల్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం బీఈడీ పేపర్ లీకేజీ విషయంపై పెద్దకాకాని పోలీస్ స్టేషన్లో నమోదు చేసిన కేసులో ఏడుగురు నిందితులను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. ఈ ఏడుగురికీ బెయిల్ మంజూరు చేస్తూ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో విచారణ జరగాల్సి ఉంది.

1,33,222 బస్తాలు మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,28,999 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,33,222 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,500 నుంచి రూ.13,800 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 63,975 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

మొక్కజొన్నకూ

మద్దతు శూన్యం

కేంద్ర, రాష్ట్ర పాలకులు రైతే రాజన్నారు.. ఆచరణలో మాత్రం అడుగడుగునా వారిని దగా చేస్తున్నారు. వారి నిర్లక్ష్యం కారణంగా అధిక వడ్డీలకు అప్పులు చేసి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వారిని పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. మొక్కజొన్న రైతు పరిస్థితి పాలకుల నిర్లక్ష్యంతో మద్దతు ధర లేక అగమ్యగోచరంగా తయారైంది.



పిట్టువారిపాలెంలో మొక్కజొన్న పొలంలో కండెలు విరుస్తున్న కూలీలు

- కల్లాల్లోనే మగ్గిపోతున్న మొక్కజొన్న రాశులు
- రైతులకు కూటమి సర్కారు మొండిచేయి
- గిట్టుబాటు ధర కల్పించని ప్రభుత్వం
- చేతివాటం చూపుతున్న దళారులు



పిట్టువారిపాలెంలో కండెలను మిషన్ వేస్తున్న దృశ్యం

బాపట్ల టౌన్: ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడిపోతున్నారు. కష్టకాలంలో రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉంది. దీంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో తల్లడిల్లిపోతున్నారు. మార్కెట్‌లో మొక్కజొన్న క్వింటా రూ. 2,500కుపైగా ఉండగా బాపట్ల జిల్లాలో ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. దళారులు క్వింటాకు రూ. 1800 నుంచి రూ.2000 లోపు మాత్రమే ఇస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రోజుల తరబడి కల్లాల్లోనే ఆరబెట్టుకోవాల్సిన దుస్థితిలో అన్నదాత ఉన్నాడు. దీంతో దళారులు అడిగిన ధరకే విక్రయిస్తున్నారు. లాభాలు రాకపోగా, అప్పుల పాలవుతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిన్నటి వరకు పంట పొలాలకు నీళ్లు లేక డీజిల్, కిరోసిన్ ఇంజిన్ల సహాయంతో తడిపారు. తీరా పంటచేతికొచ్చే తరుణంలో ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు దిగుబడులు ఆశాజనకంగానే ఉన్నాయి. ఎకరాకు 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మద్దతు ధర లేదు. పాలకులు, అధికారులు స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

మండలాలవారీగా వివరాలు..

మండలం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
చుండూరు	3,124.10
అమర్తలూరు	1,223.00
వేమూరు	1,787.80
కొల్లూరు	2,398.00
భట్టిప్రోలు	2,900.00
చెరుకుపల్లి	28.00
బాపట్ల	04.24
నగరం	15.00
రేపల్లె	1,613.00
సంతమాగులూరు	903.00
బల్లికురవ	2,087.00
మార్టూరు	3,458.00
యద్దనపూడి	1,95.00
పర్చూరు	5,17.00
కారంచేడు	44.00
ఇంకొల్లు	735.00
జె పంగులూరు	1,361.00
అద్దంకి	1,094.00
కొరిశపాడు	99.00
చీరాల	462.00
వేటపాలెం	100.00
చినగంజాం	15.00

జిల్లాలో దాదాపు 24 వేల హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేశారు.

20 రోజులుగా కల్లాల్లోనే..



ఈ ఏడాది 6 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. గతంలో ఎన్నడూలేని విధంగా కూలీల కొరతతో అధిక ధరలు హెచ్చించి మొక్కజొన్న కండెలు విరిపించాం. పెట్టుబడులు కూడా పెరిగాయి. కనీసం మద్దతుధర లేకపోవడంతో ఏం చేయాలో తెలియడం లేదు. ఇప్పటికి కలాల్లో కండెలు ఆరబోసి 20 రోజులు అవుతోంది. రేయింబవళ్ళు వాటిని చూసుకుంటూ కల్లాల్లోనే ఉంటున్నాం.

– దర్శి నాగయ్య, గవినివారిపాలెం

గిట్టుబాటు ధర కల్పించాలి



ఏడు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేశా. ఎదుర్కొంటూనే ఉన్నాం. నీటి ఎద్దడి కారణంగా రూ.వేలు ఖర్చు చేసి డీజిల్ ఇంజిన్లతో పొలానికి నీటి తడులు అందించాం. సరైన గిట్టుబాటు ధరలేకపోవడంతో దళారులు అడిగిన రేటుకే విక్రయించాల్సి వస్తోంది. ధర పెరుగుతుందేమోనన్న ఆశతో నెలరోజులుగా కల్లాల్లోనే ఆరబెట్టాం.

– చిప్పలపల్లి శ్రీను, పిట్టువారిపాలెం

మా బాధలు అర్థం చేసుకోవాలి



ప్రస్తుతం మొక్కజొన్న కొనే వారే లేరు. కౌలుకు తీసుకొని సాగుచేసుకున్న మాలాంటి సన్నకారు రైతులకు కనీస మద్దతు ధర కల్పించకపోవడంతో ఏం చేయాలో తెలియడం లేదు. దళారులు అడిగిన రేటుకే విక్రయించాల్సి వస్తోంది. పాలకులు, అధికారులు మా బాధలు అర్థం చేసుకొని గిట్టుబాటు ధర కల్పించాలి.

– మల్లవరపు శ్రీనివాసరావు, బుర్లవానిపాలెం

ఏఎన్‌ఎంల ఉద్యోగోన్నతి కౌన్సెలింగ్‌లో చేతివాటం

గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా 266 మంది ఏఎన్‌ఎంలకు గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో సోమవారం ఉద్యోగోన్నతి కౌన్సెలింగ్ జరిగింది. సోమవారం ఉదయం నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు జరిగిన ఈ కౌన్సెలింగ్‌లో పలువురు కార్యాలయ ఉద్యోగులు, యూనియన్ నాయకులు ప్రమోషన్ పొందిన ఏఎన్‌ఎంల నుంచి అందిన కాడికి దండుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏఎన్‌ఎంలకు ప్రమోషన్ ఆర్డర్స్ ఇచ్చేందుకు కింది స్థాయి ఉద్యోగులు ఒక్కో ఏఎన్‌ఎం నుంచి రూ. 500 నుంచి రూ.వెయ్యి వరకు ముక్కుపిండి వసూలు చేశారని పలువురు ఆవేదన చెందారు. ప్రమోషన్ ఆర్డర్ కాపీలు కేవలం ఒక్కటి మాత్రమే అందజేసి మిగతా కాపీలు జిరాక్స్ తీపించుకోవాలని అర్ధరాత్రి వేళ ఆందోళనకు గురిచేశారని పేర్కొన్నారు.

కోరుకున్న చోటు దక్కితే రూ.5వేలు!

ఏఎన్‌ఎంలు కోరుకున్న చోటు దక్కితే రూ. 5వేల వరకు యూనియన్ నాయకులు, కార్యాలయ ఉద్యోగులు వసూలు చేసినట్లు పలువురు ఏఎన్‌ఎంలు ఆరోపించారు. డబ్బులు ముట్టచెప్పిన వారికి కోరుకున్న చోట ప్రమోషన్ ఆర్డర్స్ ఇచ్చారని, మామూళ్లు ఇవ్వనివారికి కోరుకున్న ప్రాంతాలు ఖాళీగా ఉన్నా చూపించలేదని ఆవేదన చెందారు. ఉద్యోగోన్నతి ఉత్తర్వుల్లోనూ తప్పిదాలు ఉన్నాయని, ఒక ప్రాంతంలో పనిచేస్తుంటే, మరోప్రాంతంలో పనిచేస్తున్నట్లుగా పేర్కొన్నారని వివరించారు.

క్రేన్ సంస్థలపై ఆదాయ పన్ను శాఖ దాడులు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరులో క్రేన్ సంస్థలపై ఆదాయ పన్ను శాఖ మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించింది. పాత్తూరు, సంపత్‌నగర్ ప్రాంతాలలో ఉన్న ఫ్యాక్టరీలలో అధికారులు సోదాలు చేశారు. గుంటూరు, విజయవాడ ప్రాంతాలకు చెందిన ఆదాయపన్ను శాఖ అధికారులు మొత్తం 18 మంది ఓ బృందంగా దాడులు నిర్వహించారు. క్రేన్ అధినేత ఫ్యాక్టరీలు, బంధువుల ఇళ్లల్లో విస్తృత తనిఖీలు జరిగాయి. తనిఖీల సమయంలో అధికారులు సెల్‌ఫోన్లు సీజ్ చేశారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుల పరిస్థితి నానాటికీ దయనీయంగా మారుతోంది. ఆరుగాలం శ్రమించి పండిస్తున్న పంటకు మద్దతు ధర లభించక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. అధిక పెట్టుబడులు పెట్టి సాగు చేసినా ప్రభుత్వం నిర్లక్ష్యం వారి పాలిట శాపంగా మారుతోంది. ఇప్పుడు తెల్లజొన్న రైతుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.

తెల్లజొన్న రైతు విలవిల



క్రాప సమీపంలో జొన్న పంట కోస్తున్న కూలీలు

- పంట చేతికందినా విక్రయించే మార్గం శూన్యం
- ప్రభుత్వం నుంచి కొనుగోలు, మద్దతు ధర లేక ఆవేదన
- దళారులకు తక్కువ ధరకే అమ్మాల్సిన దుస్థితి
- కూటమి సర్కారు తీరుతో నష్టపోతున్న అన్నదాతలు



కోతకు సిద్ధంగా ఉన్న తెల్లజొన్న

కొల్లూరు: ఖరీఫ్‌లో వరి సాగు చేసిన అన్నదాతలు మూడొంతులు పంట అయినకాడికి దళారులకు విక్రయించి నష్టాలను చవిచూశారు. నామమాత్రంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో సామాన్య రైతులు పండించిన పంటల విక్రయానికి అంక్షలు ఎదురవడంతో దళారులను ఆశ్రయించక తప్పలేదు. ప్రస్తుతం రబీలో సాగు చేసిన పంటకైనా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి పారదర్శకంగా కొనుగోలు చేస్తుందని ఆశించిన రైతులకు భంగపాటే ఎదురవుతోంది.

దీనంగా తెల్లజొన్న రైతుల పరిస్థితి

రబీలో తెల్లజొన్న సాగు చేసిన రైతుల పరిస్థితి దీనంగా మారింది. నియోజకవర్గంలో చుండూరు, అమృతలూరు మండలాలలో రైతులు అధిక శాతం మినుము, పెసర సాగు చేశారు. పెసర పంటకు మాత్రమే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొల్లూరు, భట్టిప్రోలు, వేమూరు మండలాలలో ఎక్కువ విస్తీర్ణంలో మొక్కజొన్న పంట సాగైంది. సుమారు 8 వేల ఎకరాలకు పైగా తెల్ల జొన్న సాగులో ఉంది.

కొనే దిక్కేది?

కొల్లూరు మండలంలో 1,700 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో తెల్లజొన్న వేయగా.. ప్రస్తుతం పంట చేతికందింది. రైతులు జొన్న కంకులు కోసుకొని నూర్పిళ్లు పూర్తి చేస్తున్నారు. మండలంలోని కొల్లూరు, క్రాప, అనంతవరం, చిలుమూరు ప్రాంతాలలో తెల్లజొన్న కంకులు కోత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం సుమారు 200 ఎకరాల వరకు జొన్న కోతలు పూర్తయ్యాయి. ఎకరాకు సుమారు రూ. 20 వేలు పెట్టుబడులు పెట్టారు. సగటున 25 బస్తాల దిగుబడి లభిస్తోంది. గతేడాది ఇదే సమయంలో జొన్న క్వింటాకు రూ. 2,400 వరకు లభించడంతో రైతులకు లబ్ధి చేకూరింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర ప్రకటించకపోవడంతో క్వింటాకు దళారులు రూ. 2 వేలు నుంచి రూ. 2,100 వరకు ఇస్తున్నారు. దీంతో రైతాంగం నష్టపోతోంది. రబీలో సాగు చేసిన పంటల విక్రయాలకు వీలుగా వ్యవసాయ శాఖాధికారులు ఈక్రాప్ బుకింగ్ చేశారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులకు ప్రయోజనం లేకుండా పోయింది.

కొనుగోలు కేంద్రాల ఊసేదీ?

రబీలో సాగు చేసిన పంటల కొనుగోలుకు వ్యవసాయ శాఖాధికారులు పంట నమోదు చేసినప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో రైతులకు నష్టం వాటిల్లుతోంది. దళారులు చెప్పిన ధరలకే అమ్ముకోవాల్సిన అగత్యం ఏర్పడింది. పంట కోతలు చివరి దశకు చేరుకునే సమయంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ప్రయోజనం లేకుండాపోతుంది.

– టి. సురేష్, రైతు

అనుమతులొస్తే కేంద్రాలు ఏర్పాటు



తెల్లజొన్న ప్రస్తుతం కోత దశకు రావడంతో రైతులు నూర్పిళ్లు చేపడుతున్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయంలో మార్క్‌ఫెడ్ నుంచి ఆదేశాలు రాలేదు. అనుమతులు వచ్చిన వెంటనే కేంద్రాలు ఏర్పాటు చేస్తాం

– ఆర్.వెంకటేశ్వరరావు, వ్యవసాయశాఖాధికారి, కొల్లూరు.

వైవీ మాతృమూర్తికి కన్నీటి వీడ్కోలు

- వైవీ సుబ్బారెడ్డి తల్లి అంత్యక్రియలకు మేదరమెట్లకు వచ్చిన జగన్
- సుబ్బారెడ్డి తల్లి పిచ్చమ్మ భౌతిక కాయానికి నివాళులు
- కుటుంబ సభ్యులకు పరామర్శ
- అర్ధగంటపాటు అక్కడే గడిపిన జననేత



భారీగా చేరుకున్న అభిమానులకు అభివాదం చేస్తున్న వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

సాక్షి ప్రతినిధి,బాపట్ల: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ సోమవారం ఒంగోలులో మృతిచెందగా స్వగ్రామం మేదరమెట్లలో ఆమె అంత్యక్రియలు మంగళవారం బంధువులు, పార్టీశ్రేణుల అశ్రునయనాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర నలుమూలల నుంచి పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తమ అధినేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారని తెలుసుకొని వేలాదిగా కార్యకర్తలు, అభిమానులే కాదు సామాన్య జనమూ తరలి వచ్చారు. ఎంతగా అంటే జనం తాకిడికి జగన్ కాన్వాయ్ ముందుకు కదలలేకపోయింది. ఆ తర్వాత జగన్ వైవీ ఇంటికి చేరుకొని అక్కడ సుబ్బారెడ్డి తల్లి పిచ్చమ్మ భౌతిక కాయానికి నివాళులర్పించి చిన్నాన్న వైవీ.సుబ్బారెడ్డి, చిన్నమ్మ స్వర్ణమ్మ, చిన్నాన్నలు వైవీ భద్రారెడ్డి, హనుమారెడ్డి, సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్‌రెడ్డిలతోపాటు వారి కుటుంబ సభ్యులందరినీ పరామర్శించారు. భుజంతట్టి ఓదార్చారు. అక్కడే ఉన్న తల్లి విజయమ్మ, మేనమామ రవీంద్రనాథరెడ్డి ఇతర బంధువులతో మాట్లాడారు. అర్ధగంట పాటు అక్కడే ఉన్న వైఎస్ జగన్ కుటుంబ సభ్యులతో గడిపారు. వైఎస్సార్ సీపీ నేతలను పేరుపేరునా పలకరించారు. వైవీ ఇంటి నుంచి జగన్ తిరుగు ప్రయాణంలోనూ ఆయన వాహనం ముందు చేరిన కార్యకర్తలు, అభిమానులు నినాదాలతో హోరెత్తించారు. పిచ్చమ్మ భౌతికకాయానికి వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున, మాజీ ఉపముఖ్యమంత్రి మంత్రి నారాయణస్వామి, మాజీ మంత్రులు కారుమూరు నాగేశ్వరరావు, ఆదిమూలపు సురేష్, అంబటి రాంబాబు, విడదల రజని, జోగి రమేష్, ప్రకాశం జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ముస్తాఫా, బుర్రా మధుసూదనయాదవ్, జంకె వెంకటరెడ్డి, టీజేఆర్ సుధాకర్‌బాబు, పార్టీ నాయకులు కరణం వెంకటేష్, గాదె మధుసూదన్ రెడ్డి, వరికూటి అశోక్‌బాబు, మేరిగ మురళి, చుండూరు రవి, పానెం చిన హనిమిరెడ్డి తదితరులు నివాళులర్పించారు.



తల్లి అంతిమయాత్రలో వైవీ సుబ్బారెడ్డి, భద్రారెడ్డి

పోలింగ్ కేంద్రాల విభజనపై దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

బాపట్ల టౌన్: ఓటర్లు అధికంగా ఉన్న పోలింగ్ కేంద్రాల విభజనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి చెప్పారు. పోలింగ్ కేంద్రాల విభజనపై రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల అధికారులతో స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,200 మందికి మించి ఓటర్లు ఉండరాదనే నిబంధన ఉల్లంఘించరాదని తెలిపారు. విభజన ప్రక్రియకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. బాపట్ల జిల్లాలో 12,91,415 ఓటర్లు ఉన్నారన్నారు.వీరిలో 6,29,578 మంది పురుషులు, 6,61,756 మంది మహిళలు, మిగిలిన 81 మంది ఇతర ఓటర్లు అని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1,510 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. 1,100 ఓటర్లులోపు ఉన్న కేంద్రాలు 1,270 అన్నారు. 1,101 ఓటర్లకు మించిన కేంద్రాలు 250 ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నాటికి ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. రెండు కిలోమీటర్లకు మించి పోలింగ్ కేంద్రం ఓటర్లకు దూరంగా ఉండరాదన్నారు. దీనిపైనా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులతో ప్రతినెల నియోజకవర్గం, జిల్లా స్థాయిలో సమావేశాలు నిర్వహించాలన్నారు. ఓటర్ల నుంచి వచ్చిన దరఖాస్తులను అధికారులు తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ఓటు హక్కు కొరకు జనవరి నుంచి ఇప్పటివరకు 2,399 దరఖాస్తులు రాగా, 382 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జిల్లాలోని 319 మంది ఓటర్లు విదేశాల్లో ఉంటున్నారని తెలిపారు. 2,187 మంది వీఐపీ ఓటర్లు ఉండగా, దివ్యాంగ ఓటర్లు 14,551 మంది ఉన్నారన్నారు. 4,532 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని వివరించారు. ప్రతి ఓటరుకు ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. ఆధార్ అనుసంధానంలో 1.92 లక్షల ఓట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తక్షణమే పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు షేక్ షఫీ, బీజేపీ నాయకులు రామకృష్ణ, సీపీఎం నాయకులు గంగయ్య, కాంగ్రెస్ నాయకులు డి.రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఐ.మాల్యాద్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు బాలాజీ, బి.ఎస్.పి. నాయకులు కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు షేక్ గౌస్ బాషా, జనసేన నాయకులు శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యోమగాముల రాకను కాంక్షిస్తూ ప్రదర్శన



నగరం: అంతరిక్ష పరిశోధనా కేంద్రం నుంచి భూమిపై తిరిగి బయలుదేరిన వ్యోమగాములు సునీతా విలియమ్స్ తదితరులు సురక్షితంగా చేరాలని శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు ఆకాంక్షించారు. వారికి స్వాగతం పలుకుతూ నగరంలోని పాఠశాలలో ఉన్న రాకెట్ బొమ్మ వద్ద మంగళవారం ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో సైన్స్ రచయిత బొర్రా గోవర్ధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం



జె.పంగులూరు: రెడ్ క్రాస్ సొసైటీలో ఎక్కువ మంది సభ్యులను చేర్పించినందుకు మంగళవారం కలెక్టర్ జె.వెంకట మురళి బాపట్లలోని తన కార్యాలయంలో ఎంపీడీవో స్వరూపారాణిని సన్మానించారు. రెడ్ క్రాస్ సొసైటీ వారికి మండల పరిధిలో 50 మందితో రూ.1,100 చొప్పున సభ్యత్వ రుసుము కట్టించినందుకు కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బాపట్ల మేనేజింగ్ కమిటీ మెంబర్ దాసరి ఇమ్మానియేలు పాల్గొన్నారు.

శక్తియాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



యాప్‌పై అవగాహన కల్పిస్తున్న శక్తి బృంద సభ్యులు

బాపట్ల టౌన్: శక్తి యాప్‌ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లాలోని ప్రధాన కూడలి ప్రాంతాల్లో మంగళవారం శక్తి బృందాలు యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ యాప్ ఉంటే ఆపద సమయాల్లో రక్షణగా ఉంటుందన్నారు. ఎస్.ఓ.ఎస్. బటన్ ప్రెస్ చేస్తే క్షణాల్లో పోలీసు బృందాలు చేరుకొని రక్షిస్తాయని తెలిపారు. జిల్లాలో ఎస్సై నేతృత్వంలో మొత్తం 5 శక్తి బృందాలు ఉన్నాయన్నారు.

రైలెక్కాలంటే ఆపసోపాలే

చేనేతలు, వ్యవసాయ కూలీలు, వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ఉద్యోగులు ఉన్న ప్రాంతం ఈపురుపాలెం. ఈ గ్రామంలో రోజుకు ఎనిమిది రైళ్లు ఆగే రైల్వేస్టేషన్ ఉంది. చెన్నై, విజయవాడ మార్గాల్లో కీలకమైన స్టేషన్. చీరాల రూరల్ మండలంలోని చాలా గ్రామాల్లోని ప్రజలకు విజయవాడ, తిరుపతి, ఒంగోలు, నెల్లూరు వెళ్లేందుకు అనువైన స్టేషన్ ఇది. కానీ కనీస వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నిత్యం వచ్చే వారు టికెట్ తీసుకోవాలన్నా, రైలు ఎక్కాలన్నా అవస్థలు తప్పడం లేదు.

- దూరంగా టికెట్ కౌంటర్, నూతనంగా నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



ఈపురుపాలెం రైల్వేస్టేషన్

చీరాల టౌన్: చీరాల మండలంలోని ఈపురుపాలెం రైల్వేస్టేషన్ నుంచి ప్రతి రోజు విజయవాడకు నాలుగు, గూడూరు, బిట్రగుంటకు నాలుగు రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈపురుపాలెం స్టేషన్ నుంచి మేజర్ గ్రామమైన ఈపురుపాలెం, తోటవారిపాలెం, బోయినవారిపాలెం, పిట్టువారిపాలెం, సాయికాలనీ, గవినివారిపాలెం గ్రామాల నుంచి రోజు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అంతేగాక వ్యవసాయ సీజన్‌లో వందలాది మంది కూలీలు ఈపురుపాలెం నుంచి తెనాలి, ఒంగోలు వరకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల ఈ స్టేషన్‌ను కేంద్రం మూడో రైల్వేలైన్ వేసింది. టికెట్ కౌంటర్, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడే అసలు కష్టాలు ప్రారంభమయ్యాయి. ఎక్కడైనా టికెట్ కౌంటర్‌కు దగ్గర్లోనే ఫుట్‌ఓడర్ బ్రిడ్జి ఉంటుంది. ఈ స్టేషన్లో మాత్రం టికెట్ కౌంటర్ బోయినవారిపాలెం వైపు ఉంటే.. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి మాత్రం సావరపాలెం వైపు 100 మీటర్ల దూరంలో ఉంది. ఉదయం వేళల్లో ట్రైన్ ఎక్కేందుకు వచ్చిన ప్రయాణికులు అటు టికెట్ తీసుకుని ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై నుంచి వచ్చి ప్లాట్‌ఫాంకు చేరుకునేలోపు రైలు స్టేషన్‌ను వదలివెళ్లిపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి.



టికెట్ కౌంటర్‌కు దూరంగా ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి

ఎత్తు తక్కువగా ప్లాట్ ఫాం

ఉదయం వేళల్లో విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులు రైలు ఎక్కేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ప్లాట్ ఫాం ఎత్తుగా లేకపోవడంతో రైలు ఎక్కేందుకు పిల్లలు, మహిళలు, వృద్ధులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణాలు చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్లాట్ ఫాం ఎత్తు పెంచాలని కోరుతున్నారు. పరిసరాల్లో లైట్లు ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నారు. లైట్లు సక్రమంగా లేకపోవడంతో మద్యం తాగేవారు, జల్సారాయుళ్లకు స్టేషన్ ఆవాసంగా మారుతోంది. దీంతో రాత్రివేళల్లో ఈపురుపాలెం స్టేషన్లో దిగాల్సిన ప్రయాణికులు చీరాలలో దిగి ఇంటికి చేరుతున్నారు. ఇకనైనా పాలకులు స్పందించి స్టేషన్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.



ప్లాట్‌ఫాం ఎత్తు లేకపోవడంతో రైలు ఎక్కేందుకు అవస్థలు పడుతున్న ప్రయాణికులు

మాలల అణచివేతకు కూటమి ప్రభుత్వం కుట్ర

నరసరావుపేట: రాష్ట్రంలో మాలలు, వారి ఉప కులాలను అణచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర కేబినెట్ ఆమోదాన్ని వ్యతిరేకిస్తూ మాల సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. మంగళవారం నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ విస్సల జయరావు ఆధ్వర్యంలో పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల రిబ్బన్లతో నిరసన దీక్ష చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీనికి హాజరైన జాన్‌పాల్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై మిశ్రా కమిషన్ ఇచ్చిన నివేదికపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. 2021 జనాభా లెక్కలు తేల్చకుండా వర్గీకరణ అమలు చేస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్రంలో వేసిన వన్‌మెన్ కమిషన్ ఇచ్చిన నివేదికకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపటాన్ని మాల మహానాడు వ్యతిరేకిస్తుందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ఇస్తూ చేసిన సూచనలను అమలు చేయకుండా, ఎంపారికల్ డేటా తీయకుండా రాష్ట్ర విభజనకు ముందు ఉన్న 2011 జనాభా లెక్కలను ఆధారం చేసుకొని వర్గీకరణ చేయటం దారుణన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన పనులు చేస్తున్న ప్రభుత్వానికి ప్రజా పోరాటంలో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా రానున్న రోజుల్లో నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పల్నాడు జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ గోదా బాల, జిల్లా ఉపాధ్యక్షుడు కోండ్రు విజయ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిపూడి ఏసురత్నం, జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రపాటి ఎర్రయ్య, నాయకులు పాల్గొన్నారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మాలమహానాడు నాయకులు

ఆస్తి కోసం పినతల్లిపై యువకుడి దాడి



చికిత్స పొందుతున్న కోటేశ్వరమ్మ

జె.పంగులూరు: ఆస్తి కోసం పినతల్లిపై కొడుకు దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటన మండల పరిధిలోని రేణింగవరం గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకోగా, మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శీలం ప్రసాద్‌రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డికి రెండు వివాహాలు అయ్యాయి. మొదటి భార్య కుమారుడైన ప్రసాద్‌రెడ్డి, అతడి భార్య అరుణ దాడి చేయడంతో లక్ష్మారెడ్డి రెండో భార్య కోటేశ్వరమ్మ తలకు తీవ్ర గాయమైంది. వెంటనే ఆమెను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

టైరు పేలడంతో కారు ప్రమాదం.. వ్యక్తి మృతి



ప్రమాదంలో ధ్వంసమైన కారు

మార్టూరు: జాతీయ రహదారిపై కారు టైరు పేలడంతో అదుపుతప్పి చోటుచేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం బాపట్ల జిల్లా మార్టూరు మండలం బొల్లాపల్లి గ్రామ సమీపంలో జరిగింది. హైవే పెట్రోలింగ్ సిబ్బంది రవి, స్థానికుల కథనం ప్రకారం వివరాలు... విశాఖపట్నానికి చెందిన భీమన నవీన్ (32) గుంటూరుకు చెందిన తన స్నేహితుడి కుటుంబ సభ్యులైన నలుగురు పురుషులు, ఇద్దరు మహిళలు, ఒక పాపతో కలిసి తమిళనాడు తీర్థయాత్రకు వెళ్లాడు. యాత్ర ముగించుకుని తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో బొల్లాపల్లి టోల్గేట్ దాటిన కాసేటికే వీరు ప్రయాణిస్తున్న ఇన్నోవా కారు ముందు టైరు ఒక్కసారిగా పేలింది. దీంతో కారు అదుపుతప్పి రహదారి పక్కన కాలువ కల్వర్టును వేగంగా ఢీకొంది. డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న నవీన్ ఎయిర్ బ్యాగులు ఓపెన్ అయినప్పటికీ ఛాతీ కారు ముందు భాగానికి ఒత్తుకొని తీవ్రంగా గాయపడ్డాడు. కారులో ఉన్న వారిలో చితర జయభారతి, కసినికోట భావన, అఖిల్‌లు గాయాలపాలయ్యారు. సమీపంలో ఉన్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది రవి పోలీసులకు సమాచారాన్ని అందించారు. హైవే అంబులెన్స్ వాహనంలో క్షతగాత్రులను ఒంగోలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నవీన్‌ను పరిశీలించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారు. మార్టూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మత్తులో మునిగి తేలుతున్న యువత

- పట్టించుకోని పోలీసు అధికారులు
- ఫ్లైఓవర్ వద్ద నిత్యం మత్తు ఇంజక్షన్ల వాడకం
- మైకంలో ఇష్టమొచ్చినట్లు కేకలు
- భయభ్రాంతులకు గురవుతున్న స్థానికులు



జమ్ములపాలెం ఫ్లైఓవర్‌పై యువకుల కోసం గాలిస్తున్న పట్టణ పోలీసులు

బాపట్ల టౌన్: బాపట్ల జిల్లా కేంద్రంలోని యువత మత్తులో జోగుతోంది. తాజాగా మత్తు కోసం ఇంజక్షన్లు చేసుకునే స్థాయికి దిగజారారు. జిల్లా కేంద్రం నడిబొడ్డున ఈ తతంగం జరుగుతున్నా పోలీసులు చర్యలు తీసుకోకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని జమ్ములపాలెం ఫ్లైఓవర్ బ్రిడ్జి ఈ తరహా యువతకు అడ్డాగా మారింది. ప్రతి రోజు సాయంత్రం చీకటి పడుతున్న సమయంలో కొందరు యువకులు పరస్పరం మత్తు ఇంజక్షన్లు చేసుకోవడం షరా మామూలైంది. కొద్ది సేపటికి ఇష్టమొచ్చినట్లు కేకలు వేయటం, అటుగా రాకపోకలు సాగించే స్థానికులను భయభ్రాంతులకు గురిచేయటం పరిపాటిగా మారింది. మూడు రోజుల క్రితం మండలంలోని వెదుళ్ళపల్లి సమీపంలో ఓ మహిళ మత్తు కోసం టాబ్లెట్లు పొడిని విక్రయిస్తుండగా స్థానికుల ఫిర్యాదుతో ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ ఘటన మరవక ముందే తాజాగా మంగళవారం రాత్రి కొందరు యువకులు జమ్ములపాలెం ఫ్లైఓవర్ బ్రిడ్జిపైకి చేరి ఏకంగా మత్తు ఇంజక్షన్లు చేతి నరాలకు చేసుకోవడం పట్టణంలో కలకలం రేపింది.

కొరవడిన పర్యవేక్షణ

విద్యా కేంద్రంగా పేరున్న బాపట్లలో ఎన్నో ప్రముఖ కళాశాలలు ఉన్నాయి. ఇలాంటి యువత కదలికలను పసిగట్టడంలో పోలీస్ శాఖ అడుగడుగునా విఫలం అవుతూనే ఉంది. పట్టణ నడిబొడ్డున మంగళవారం జరిగిన ఘటన కూడా పట్టణంలోని కొందరు రహస్యంగా వీడియోలు తీసి సోషల్‌మీడియాలో పోస్టుచేయటం ద్వారా విషయం వెలుగులోకి వచ్చింది. తర్వాత పోలీసులు అక్కడకు చేరుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మత్తు మందు వినియోగం, సరఫరాపై జిల్లా ఎస్పీ దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

12వ పీఆర్సీ చైర్మన్‌ను తక్షణమే నియమించాలి

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: పన్నెండో వేతన సవరణ సంఘాని(పీఆర్సీ)కి తక్షణమే చైర్మన్‌ను నియమించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన సంఘ ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. తొమ్మిది నెలల క్రితం అధికారంలోకి రాక ముందు, తక్షణమే పీఆర్సీ కమిషన్‌ను నియమిస్తామని, సకాలంలో డీఏలు ఇస్తామని హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చాక విస్మరించారని ఆరోపించారు. ఇప్పటికీ 12వ పీఆర్సీ చైర్మన్‌ను నియమించకపోవడం దారుణమన్నారు. 12వ పీఆర్సీ చైర్మన్‌ను నియమించి, విధి విధానాలను అప్పగించి, సంఘాలతో చర్చలు జరిపి ఐఆర్ ప్రకటించి అమలు చేసేందుకు మరింత జాప్యం నెలకొనే పరిస్థితులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన మూడు డీఏలు ఇప్పటికీ చెల్లించలేదని, మరొక డీఏ జూలైకి రాబోతుందని, ఇప్పటికైనా డీఏలను తక్షణం చెల్లించాలని కోరారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం 2017లో ఇచ్చిన మెమో 57ని ఇంత వరకు అమలు చేయకపోవడం పట్ల తీవ్ర వ్యతిరేకత ఉందని తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా యూటీఎఫ్ ఉద్యమ కార్యాచరణ తీసుకుంటుందని హెచ్చరించారు. సంఘ రాష్ట్ర ప్రచురణ విభాగ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రతి గ్రామ పంచాయతీకి ఒక మోడల్ ప్రాథమిక పాఠశాలలను అన్ని హంగులతో ఏర్పాటు చేయాలని, మిగిలిన ప్రాథమిక పాఠశాలలను యధాతధంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. 60 మంది విద్యార్థులు దాటిన ప్రాథమికోన్నత పాఠశాలలను హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేసి, మిగిలిన యూపీ పాఠశాలను యధావిధిగా కొనసాగించాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో సమాంతర మీడియాలను కొనసాగిస్తూ ప్లస్ 2 పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలన్నారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్, జిల్లా సహాధ్యక్షురాలు వై. నాగమణి, కోశాధికారి ఎండీ దౌలా, జిల్లా కార్యదర్శులు ఆదినారాయణ, సాంబశివరావు, గోవిందయ్య, ఆంజనేయులు, షకీలా బేగం, కేదార్ నాథ్, రంగారావు, ప్రసాద్, ఆడిట్ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, కోటిరెడ్డి, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ఆడపిల్లల సంఖ్య పెంచాలి

గుంటూరు డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్ : మగపిల్లలతో పోలిస్తే ఆడపిల్లల నిష్పత్తి తక్కువగా ఉంటుందని, పెంపునకు కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి చెప్పారు. గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో గర్భస్థ లింగ నిర్ధారణ నిరోధక చట్టం అమలు, జెండర్ వైలెన్స్‌పై ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రు నిర్వాహకులు, వైద్యులతో సమావేశం జరిగింది. జిల్లా మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ సభ్యులు, సలహా సంఘ సభ్యులకు, ప్రసూతి వైద్య నిపుణులు సమావేశంలో పాల్గొన్నారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ నిరోధక చట్టం అమలు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతని చెప్పారు. జీజీహెచ్ గైనకాలజి ప్రొఫెసర్ డాక్టర్ పి.జయంతి మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లు నిర్వహించాల్సిన రిజిస్టర్లు, జిల్లాకు పంపాల్సిన రిపోర్టులు, పాటించాల్సిన నియమాల గురించి వివరించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగమణి మాట్లాడుతూ పీసీపీఎన్‌డీటీ చట్టం అతిక్రమిస్తే విధించే శిక్షల గురించి వివరించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, తెనాలి డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అన్నపూర్ణ, డెమో ఎ.జయప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతిపై కేసు



గుంటూరు రూరల్: వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనపై నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. సీఐ వంశీధర్ కథనం ప్రకారం నల్లపాడు గ్రామానికి చెందిన రాజుకు, మామిళ్ళపల్లికి చెందిన సృజన (23)తో ఏడాది క్రితం వివాహమైంది. ఇటీవల నుంచి భార్యాభర్తల మధ్య నిత్యం గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సృజన మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలిసిన సృజన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు భర్తే తమ కుమార్తెను చంపాడని, ఉరివేసుకుందని సృష్టించాడని ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. రాజును అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

చిట్‌ఫండ్ బాధితుల విచారణ

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): నరసరావుపేటలోని సాధన చిట్‌ఫండ్ బాధితులను సీఐడీ గుంటూరు ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం విచారణ చేశారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఎప్పటి నుంచి చిట్‌లు వేస్తున్నారు? ఎంత మొత్తంలో నెల నెలా చెల్లిస్తున్నారనే అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు సుమారు 15 మందికిపైగా బాధితుల వద్ద వివరాలు సేకరించారు. అలాగే నరసరావుపేటలోని ఓ ప్రైవేటు బ్యాంక్ ప్రతినిధులు కూడా తమ గోడును సీఐడీ అధికారులకు వినిపించారు.

అప్పుల బాధ తాళలేక మహిళ ఆత్మహత్య

దామరపల్లి(తాడికొండ): వ్యవసాయంలో నష్టం రావడంతో అప్పుల బాధ పెరిగి కుటుంబ పోషణ భారంగా మారడంతో మహిళ ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటన తాడికొండ మండలం దామరపల్లి గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తాడికొండ మండలం దామరపల్లి గ్రామానికి చెందిన వట్టికూటి శ్రీనివాసరావు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. గత కొన్నేళ్లుగా వ్యవసాయంలో నష్టం వస్తుండటంతో ఉన్న 3 ఎకరాలు అమ్మి అప్పులు తీర్చారు. కౌలుకు పొలం తీసుకొని వ్యవసాయం చేస్తుండగా ఈ ఏడాది కూడా తీవ్రంగా నష్టం రావడంతో మనస్తాపం చెందారు. అప్పు ఇచ్చిన వారు ఒత్తిడికి గురిచేస్తుండటంతో కుటుంబ పోషణ కూడా కష్టంగా మారడంతో మనస్థాపంతో శ్రీనివాసరావు భార్య అరుణ కుమారి ఈనెల 14న పొలానికి వేసేందుకు తెచ్చిన గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గుంటూరులోని ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా మంగళవారం ఉదయం మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతులకు రిజర్వ్ ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికి ముగ్గురి వద్ద నుంచి రూ.13 లక్షలు నగదు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసుల కథనం ప్రకారం.. ఆంజనేయ పేట ప్రాంతంలో రుద్రా ఫౌండేషన్ యజమాని అయిన అరమండ రవికుమార్ అనే వ్యక్తి 2022లో ఉద్యోగావకాశాల పేరుతో పత్రికా ప్రకటనలు చేశాడు. ఆ ప్రకటనలు చూసిన పల్నాడు జిల్లా యడ్లపాడుకు చెందిన పాలపర్తి కోటేశ్వరమ్మ రవికుమార్‌ను కలిశారు. అతని మాయమాటలు నమ్మి రూ.5లక్షలు చెల్లించారు. అలాగే గడ్డల వంశీ అనే వ్యక్తి రూ.3 లక్షలు, గొట్టిపాటి మరియదాసు అనే వ్యక్తి రూ.5 లక్షలు రవికుమార్‌కు ఇచ్చారు. అయితే ఆ తర్వాత ఉద్యోగాలు రాకపోవడంతో మోసపోయినట్టు గుర్తించిన బాధితులు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టాభిపురం సీఐ పోస్టుపై సందిగ్ధం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): పశ్చిమ సబ్ డివిజన్‌లోని పట్టాభిపురం పీఎస్ సీఐ పోస్టుపై సందిగ్ధం నెలకొంది. వీఆర్‌లో ఉన్న సీఐ ఎం.మధుసూదనరావును ఈనెల 16న పట్టాభిపురం పీఎస్ సీఐగా నియమిస్తూ ఓ పోలీస్ ఉన్నతాధికారి నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అప్పటి వరకు విధుల్లో ఉన్న వీరేంద్రబాబును సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఈ క్రమంలో కొత్త సీఐగా మధుసూదనరావు అదే రోజు రాత్రి స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. అయితే గుంటూరు రేంజ్ కార్యాలయం నుంచి ఈ పోస్టింగ్‌కు బ్రేక్‌పడినట్లు తెలుస్తోంది. దీంతో సందిగ్ధం నెలకొంది. బుధవారం సాధ్యమైనంత వరకు ఆయనే మళ్లీ సీఐగా కొనసాగే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

విద్యార్థులు నైపుణ్యాలకు పదును పెట్టాలి



మాట్లాడుతున్న ఏఎన్‌యూ వీసీ గంగాధరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు అంతర్గతంగా దాగిన నైపుణ్యాలకు పదును పెట్టాలని ఏఎన్‌యూ ఉప కులపతి ఆచార్య కె.గంగాధరరావు పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మంగళవారం ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా వీసీ గంగాధరరావు మాట్లాడుతూ జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకునే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి సూచించారు. కళాశాల కమిటీ అధ్యక్షుడు పోలిశెట్టి శ్యాం సుందర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. అనితాదేవి మాట్లాడుతూ విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈసందర్భంగా ఎంకాం విద్యార్థిని షేక్ షహనాజ్, ఎంబీఏ విద్యార్థి కె.అనంతలక్ష్మి, ఎమ్మెస్సీ మ్యాథ్స్‌లో వై.నాగమణి, ఫిజిక్స్‌లో బి.దుర్గా లావణ్య, కంప్యూటర్స్ సైన్స్‌లో కె.నాగసాయి రమ్య, కెమిస్ట్రీలో జుబేర్ అహ్మద్, ఎంసీఏ విద్యార్థి ఎన్. సాయిలీల ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. బీకాం జనరల్ విభాగంలో టాపర్‌గా నిలిచిన నరేంద్ర, బీకాం కంప్యూటర్స్‌లో షేక్ ఫారినా, బీఎస్సీ బీజెడ్‌సీలో షేక్ ఇషా సుల్తానా, బీబీఏలో జి.శ్వేత, ఇంటర్మీడియెట్ ఎంపీసీలో టాపర్ పి. గౌస్య ప్రతిభా పురస్కారాలు పొందారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, అధ్యాపకులు బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, డీవీ చంద్రశేఖర్, ఎస్. శ్రీనివాసరావు, యు. రవికుమార్ పాల్గొన్నారు.